


కాంభోజి జంపె

నిన్ను బాసిన యట్ల - నెలతకు వియోగ దశలు
యెన్నడును దోప - విదియేమొ గానీ

నిను దలచి లలితాంగి - నీరూప మాత్మలో
గనినీవు సవి బయలు - కౌగిలించినది
తనర నాకాశ త-త్వము నీ మహత్వమని
వనిత యెవ్వరిచేత - వినెనొగానీ

నిను బొగడి నీరూపు - కనుదోయి కెదురైన
తనివి దీరక బయలు - తగజూడ దొడగె
మునుకొన్న సర్వతో - ముఖుడవనగ నిను
వెనక కే భావమున - వినెనొగానీ

తలపునను వాక్కునను - తలపదలపగ నీవు
కలసి యాకమలాక్షి -గౌగలించితివి
తెలిసితిమి వేంకటా - ధిపతి నీవిన్నింట
గలవనెడు మాట ని - క్కంబువో గానీ

ఆది భౌతికానుభవాలలో దానెక్కువగా భావించిన శృంగారాన్ని ఆధ్యాత్మిక హిమాద్రి శృంగాల కెక్కించిన మహాపురుషుడు అన్నమాచార్యులు. "ఆయన రచించిన శృంగార పదాలు ఒక విశాల విశ్వం వంటివి. వాటి అసాధారణ సౌందర్యం ప్రత్యేకంగా చర్చించ వలసింది. ఈ పదమొక్కటి గమనిస్తే తరువాత శృంగార కవులకన్న అతడెంత యెత్తులో ఉన్నాడో గ్రహింపగలము". (రాళ్లపల్లివారు)

అలమేల్మంగా వేంకటేశ్వరులకు విరహం నిత్యం. కొండపై స్వామివారు. కొండకింద అమ్మవారు. అయినా ఆమెయందు విరహపు ఛాయలు ఏమీ కనబడలేదట అన్నమయ్య్ కు. ఇదేమి విచిత్రం అని చూస్తే ఆయన రసదృష్టికి గోచరించిన రమణీయ సత్యం ఇది.

"నారాయణ పరోధ్యాతా ధ్యానం నారాయణః పరః
అంతర్బ హిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థిత్సపిః"

ఆమె స్వామిని తలచినంతనే ఆయనామెకు మనసులో సాక్షాత్కరించాడు. ఆయనే అన్న భావంతో ఆమె ఆకాశాన్ని ఎదకు హత్తుకున్నది. ఆకాశ తత్వం ఆయన మహత్వమే అనీ ఆ ఆకాశరూపుడి సంగతి ఆ ఆకాశరాజ పుత్రిక ఎవ్వరిచేత విన్నదో?

స్వామిని ఆమె పొగడినంత స్వామి రూపం ఆమెకు ప్రత్యక్షమైనది. అంతర్ముఖ దృష్టి చేత జరిగిన ఆ దివ్యమంగళ విగ్రహ సౌందర్యా స్వాదనలో తనివి తీరక ఆమె తన దృష్టిని బహిర్ముఖం చేసి బయలుకేసి అనిమేష దృష్టులు సారించినది. 'అంతర్ముఖ సమారా ధ్యా బహిర్ముఖ సుదుర్లభా' అని లలితా సహస్రం. ఎటు చూసినా ఆమె చూపును స్వామి రూపు పలుకరిస్తున్నది. సర్వతోముఖుడని ఆయన గూర్చిన రహస్యం మునుపు ఏవిధంగా తెలుసుకొన్నదో యీ  అలమేలుమంగ.

నిను దలచి, నిను బొగడి మనోవాక్కర్మలొనరిస్తే నీవు ఆమెను కాయకంగా కౌగిలించావు. ఈ మీశృంగారానికి త్రికరణశుద్ధి ఏర్పడ్డది. శ్రీ వేంకటాధిపతీ! నీవు సర్వాంతర్యామి వన్నది నిజమే నన్నమాట. ఈమె చేష్టలు చూస్తేగాని మాకు తెలియలేదు సుమా. ఇప్పుడు తెలిసింది! అంటూ అన్నమాచార్యులు ఈ విరహిణి అవస్థని వైకుంఠపు ఎత్తులకు చేర్చారు.